بسم الله الرحمن الرحيم

# తొలి పలుకు

అల్లాహ్‌కు మాత్రమే సర్వ స్తోత్రములు చెందును. ఆయనే సర్వలోకాలకు ప్రభువు, ప్రతిఫల దినానికి అధిపతి, ఆయన ఎంతో పరిశుద్ధుడు సంరక్షకుడు. అల్లాహ్ శాంతి మరియు కరుణ కటాక్షాలు ప్రవక్త ముహమ్మద్ﷺపై, ఆయన కుటుంబీకులపై మరియు ఆయన అనుచరులపై, పుణ్యాత్ములైన సత్య మూర్తులపై కురియుగాక!.

మరణానంతర జీవితం మానవునికి అసలైన జీవితం. ఇహలోక జీవితంలో చేసుకున్న మంచిచెడులు మాత్రమే అతని వెంట వస్తాయి. మిగతా విషయాలన్ని ఇహలోక జీవితానికే పరిమితం. మానవుడు అసలైన విజయ లక్ష్యం సాధించాలంటే పరలోక విశ్వాసం, జ్ఞానం మరియు భయం, భక్తిని సాధించాలి. ఇహలోకంలో కూడా మనిషి శాంతి సుఖాలతో ఉండాలంటే మరియు సమాజం మానవ మర్యాదలతో ముందుకు నడవాలంటే పరలోక విశ్వాసమే పునాది. మరణానంతర జీవితం లేదంటే! మంచి, చెడులకు, సద్గుణాలకు, దుర్గుణాలకు, పాపాలకు, పుణ్యాలకు అర్థాలే ఉండవు. చావు బ్రతుకులకు, జంతువులకు, మానవులకు, స్వర్గానికి, నరకానికి కూడా అర్థమే లేదు.

మనిషి మరణించిన తరువాత తన విశ్వాసం ప్రకారం ప్రశ్నించబడుతాడు. ఒకవేళ అవిశ్వాసిగా ఉంటే, సర్వసృష్టికర్తను విశ్వసించకుండా నాస్తికుడిగా మారిపోయి తన ఇష్టానుసారంగా జీవించడమే మానవుని లక్ష్యం

https://teluguislam.net


అనుకుంటే అతను అవిశ్వాసి. ఇంకా కొంత మంది ప్రజలు దేవుడు ఉన్నాడనీ పరలోకం వాస్తవమేననీ, స్వర్గం, నరకం నిజమేననీ విశ్వసించినా వాటి వాస్తవాలను గ్రహించకుండా తమ ఇష్టానుసారంగా మూఢ విశ్వాసాలకు అనుగుణంగా ఆరాధించేవారు కూడా అవిశ్వాసులే.

దేవునిపై విశ్వాసం లేకపోతే, మరణానంతర జీవిత వాస్తవాలను విశ్వసించకపోతే, మరియు వాటిపై దృఢమైన నమ్మకం లేకపోతే, ఇంకా తమ జీవితాలను పుణ్య జీవితాలుగా మార్చుకోకపోతే, అలాంటివారి ఇహపరాల జీవిత ఫలితాలు శూన్యమే. వారు ఎన్ని మానవతా కార్యసాధనలు చేసినా, చక్రవర్తులుగా ఉండి రాజ్యం మొత్తం దానం చేసినా, పరలోక లక్ష్యాన్ని సాధించలేరు. నరకాగ్ని నుండి రక్షించబడలేరు.

మానవునికి ప్రసాదించబడిన ఒక్కొక్క క్షణం మరియు ఒక్కొక్క అనుగ్రహం గురించి ప్రశ్నించడం జరుగుతుంది. వాటికి సమాధానం ఇవ్వనిదే మనిషి ఒక్క అడుగు ముందుకు వేయలేడు. అతను తాను చేసిన ప్రతి పనిని, ప్రతి మాటను, ప్రతి కుట్రను గురించి ప్రశ్నించబడుతాడు.

మరణానంతర జీవిత విశ్వాసం వలన మానవుడు పరలోక బాధల నుండి రక్షింపబడాలనీ, పరలోక జ్ఞానాన్ని అధ్యయనం చేసి దాన్ని విశ్వసిస్తాడు. ఇహలోక జీవితాన్ని ఉత్తమ రీతిలో గడుపుటకై సర్వ ప్రయత్నాలు చేస్తాడు. అలాగే మరణానంతర జీవిత విశ్వాసం వలన మానవుడు మృత్యువు పొందే వరకూ ఒక లక్ష్యాన్ని సాధించాలనీ శ్రమిస్తాడు. ఆ మహా లక్ష్యమే స్వర్గం.

మరణానంతర జీవితానికి సంబంధించిన ముఖ్యమైన అగోచర విషయాలను అంటే మనిషి మరణించిన తరువాత నుండి స్వర్గంలోనికి లేక నరకంలోనికి చేరుకునే వరకు ఎదురయ్యే విషయాలను ఖుర్ఆన్ మరియు

ప్రామాణిక హదీసుల వెలుగులో అల్లాహ్ ప్రసాదించిన జ్ఞానం మేరకు మీ ముందు పొందుపరిచే ప్రయత్నం చేసాము.

''అహ్వాలుల్ ఖియామహ్''అనే పేరున అబ్దుల్ మలిక్ అల్ కులైబ్ గారు, మరియు ''అల్ జన్నత్ వన్నార్'' పేరున ఉమర్ అల్ అష్ఖర్ గారు ఖుర్ఆన్ ఆయతులను మరియు ప్రామాణికమైన హదీసులను సేకరించి అరబీ భాషలో గ్రంథస్థం చేసారు. ఈ రెండు పుస్తకాలను అధ్యయనం చేసిన తరువాత మేము మీ కొరకు 'మరణానంతర జీవితము' పేరుతో ఈ పుస్తకాన్ని సంక్షిప్తంగా తెలుగు భాషలో కూర్పు చేసాము. మరి కొన్ని వివరాలను కూడా అనేక ప్రామాణికమైన హదీసు గ్రంథాల నుండి సేకరించి చాలా సులభంగా అర్థమయ్యే రీతిలో కూర్పు చేసాము.

జమ్ఇయతూ ఎహ్యా ఉత్తురాస్ అల్ ఇస్లామీ– మర్కజుల్ హిదాయా లితౌయితిల్ జాలియాత్ (ఇస్లాం పరిచయ సమితి కువైట్) సంస్థ ఖుర్ఆన్ మరియు సహీహ్ హదీసుల వెలుగులో ఇస్లాం పరిచయ కార్యక్రమాన్ని చేపట్టింది. మన తెలుగు భాషలో కూడా ఈ సంస్థ ద్వారా అనేక పుస్తకాలు మరియు కరపత్రాలు ప్రచురించబడ్డాయి. వారి సేవలను అల్లాహ్ స్వీకరించుగాక.

అనేక మంది సోదరులు అనువాద దోషాలను సరిదిద్ది నాకు సహాయం చేసారు. అల్లాహ్ వారందరికీ మంచి ప్రతి ఫలాన్ని ప్రసాదించుగాక. మనందరినీ అల్లాహ్ ఇహపరాల కీడునుండి రక్షించి, తన కరుణ కటాక్షాలతో క్షమించి, స్వర్గాన్ని ప్రసాదించుగాక, ఆమీన్.

జఫరుల్లాహ్ ఖాన్ నద్వీ

10/08/2008